క్లుప్తంగా

పాలపోలమ్మను దర్శించుకున్న తమ్మినేని



మాజీ స్పీకర్ తమ్మినేనికి ప్రత్యేక వస్త్రాలతో సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమదాలవలస: ఆమదాలవలస గ్రామ దేవత పాలపోలమ్మ తల్లిని మాజీ స్పీకర్, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాం కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా ఏడో రోజు చండిక దేవి అవతారంలో ఉన్న అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. తమ్మినేని దంపతులకు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు అందజేసి ప్రత్యేక వస్త్రాలతో సత్కరించారు. తమ్మినేని వాణమ్మ, తమ్మినేని చిరంజీవినాగ్, అల్లంశెట్టి ఉమామహేశ్వరారవు, కూన నాగు, ఆలయ కమిటీ సభ్యులు మొదలవలస రమేష్, కూన అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణ సంఘం పటిష్టతకు కృషి



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు సదాశివుని రాంబాబు

నరసన్నపేట: మండల శిష్టకరణ సంఘం పటిష్టతకు కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని సంఘం అధ్యక్షుడు సదాశివుని రాంబాబు అన్నారు. స్థానిక సంఘం భవనంలో ఆదివారం సంఘం విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సంఘం మాజీ అధ్యక్షుడు, జిల్లా సంఘం ప్రతినిధి సదాశివుని కృష్ణ మాట్లాడుతూ.. సభ్యులకు సంఘం అండగా ఉండాలన్నారు. కార్యక్రమం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రాజమహంతి గోవిందరావు, కోశాధికారిగా బలివాడ కృష్ణారావు, ఉపాధ్యక్షులుగా రఘుపాత్రుని శ్రీధర్(బుజ్జి), ఏపీవీ రమణమూర్తి, ఆర్వీ రమణమూర్తి, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా ఉరిటి శేఖరరావు, ఆర్.కాళిదాస్, సదాశివుని సింహాచలం, ఎస్.ఎం.ప్రసాద్, ముఖ్య సలహాదారుగా ఎస్.కృష్ణను ఎన్నుకున్నారు.

వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు



వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని చదును చేయిస్తున్న చైర్మన్ సన్యాసిరావు

పాతపట్నం: దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నీలమణిదుర్గ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలను ఆలయం పక్కన తెంబూరు రోడ్డులో పార్కింగ్ చేయాలని ఆలయ చైర్మన్ అక్కుందర సన్యాసిరావు అన్నారు. ఆదివారం ఆలయం పక్కన తెంబూరు రోడ్డులో వాహనాల పారింగ్ స్థలాన్ని జేసీబీతో బాగుచేశారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా వాహనాలను ఆలయం పక్కన భక్తులు పెట్టుకోవాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తెంబూరు రోడ్డు బురదతో నిండిపోవడంతో కంకర వేసి బాగుచేయడం జరిగిందని చైర్మన్ తెలిపారు. సైలాడ సతీష్, సిరిపురం శంకర్, గొరుశెట్టి దుర్గారావు, దాసరి రమణ, మజ్జి ఆనంద్ ఉన్నారు.

మత్తుపదార్థాలు విక్రయిస్తే చర్యలు



జాగిలంతో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ రమేష్ బాబు

మెళియాపుట్టి: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక ఎస్‌ఐ పిన్నింటి రమేష్ బాబు అన్నారు. మండలంలోని చాపర, జాడుపల్లి గ్రామాల్లోని పలు కిరాణా, పాన్ షాపులు, ఇతర ప్రదేశాల్లో నిషేధిత గంజాయి, మత్తుపదార్థాలను గుర్తుపట్టడానికి ప్రత్యేక శిక్షణ పొందిన పోలీసు జాగిలంతో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ యువత భవిష్యత్‌ను నాశనం చేస్తూ అక్రమార్జనే ధ్యేయంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగానే పోలీసు జాగిలం సహాయం తీసుకుంటున్నామని తెలిపారు. స్టేషన్ పరిధిలోని కిరాణా షాపుల్లో, ఎవరైనా వ్యక్తుల వద్ద గంజాయి, నిషేధిత మత్తుపదార్థాలు కలిగి ఉంటే సమాచారం అందజేయాలని ప్రజలను కోరారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నెరవేరని లక్ష్యం..!



నిరుపయోగంగా ఉన్న ఆమదావలస మండలంలోని రామచంద్రాపురం కేంద్రం

- కానరాని వర్మీకంపోస్టు, సేంద్రియ ఎరువుల తయారీ
- గ్రామాల్లో ఎక్కడికక్కడే చెత్త కుప్పలు
- ప్రబలుతున్న అంటువ్యాధులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



వృథాగా ఉన్న సరుబుజ్జిలి మండలంలోని వీరభద్రాపురం కేంద్రం

సరుబుజ్జిలి: స్వచ్ఛగ్రామాలే లక్ష్యంగా ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించి పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను (ఎస్‌డబ్ల్యూపీసీ) ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఆశించిన స్థాయిలో ప్రగతి కనిపించడం లేదు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో 110 పంచాయతీలకు చెత్త సంపద తయారీ కేంద్రాలు మంజూరు చేశారు. జనాభా ప్రాతిపదికన స్వచ్ఛభారత్ నిధుల నుంచి ఒక్కో యూనిట్‌కు రూ.4 లక్షల నుంచి రూ.9 లక్షల వరకు నిధులు మంజూరుచేసి నిర్మాణాలు చేశారు.

ముఖ్య ఉద్దేశం ఇదే..

గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లు ప్రతీ ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తతోపాటు, వీధుల్లోని చెత్తను సేకరించి రిక్షాల ద్వారా కేంద్రాలకు తరలించాలి. అక్కడి తడి, పొడి చెత్తను వాటికి కేటాయించిన కుండీల్లో నిల్వ చేయాలి. నిల్వ చేసి వాటితో వర్మీకంపోస్టు, సేంద్రియ ఎరువులు తయారుచేసి రైతులకు తక్కువ ధరలకు విక్రయించాలి. గ్రామాల్లో గల ప్లాస్టిక్, స్క్రాప్ వ్యర్థాలను దుకాణాలకు విక్రయించి పంచాయతీలకు అదనపు ఆదాయాలను పెంచాలన్నదే ఈ కేంద్రాల ఏర్పాటు ముఖ్య లక్ష్యం.

నిరుపయోగం..

ఆమదాలవలస నియోజకవర్గంలో ఎస్‌డబ్ల్యూపీసీలు..				
మండలం	సరుబుజ్జిలి	ఆమదాలవలస	బూర్జ	పొందూరు
ఎస్‌డబ్ల్యూపీసీలు	21	30	28	32

చెత్త సంపద కేంద్రాలు సక్రమంగా పనిచేయకపోవడం వలన చెత్త ఎక్కడికక్కడే వేస్తున్నారు. దీనివలన వర్షాల సమయంలో ఈగలు, దోమలు చేరి ప్రజలు అంటువ్యాధులు బారినపడి ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.

వర్మీకంపోస్టు తయారుచేయాలి



కేంద్రాలను పేరుకే నిర్మించారు. వాటిలో వర్మీకంపోస్టు, సేంద్రియ ఎరువులు తయారీ జరగడంలేదు. చాలా కేంద్రాల్లో తడి, పొడి చెత్త వేరు చేయడం లేదు. ఈ కేంద్రాలు ఏర్పాటువలన ప్రయోజనం లేదు.

– పి.రాజు, పీఎంపేట, సరుబుజ్జిలి, మండలం

అధికారులు పర్యటనలు చేయాలి



అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా తరచూ గ్రామాల్లో పర్యటిస్తే సమస్యలను సులువుగా గుర్తించవచ్చు. పంచాయతీలకు కూటమి ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడంతో వీటి నిర్వహణ భారమవుతోంది.

– పి.మోహన్‌రావు, మతలబుపేట, సరుబుజ్జిలి మండలం

వినియోగంలోకి తెస్తాం

ఎస్‌డబ్ల్యూపీసీలను తనిఖీ చేస్తాం. సక్రమంగా పనిచేయని వాటిని వినియోగంలోకి తీసుకువస్తాం. సేంద్రి ఎరువులు, వర్మీకంపోస్టు తయారీకి చర్యలు తీసుకుంటాం. వీటిని రైతులకు విక్రయించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తాం.

– బి.రామారావు, ఈఓపీఆర్డీ, సరుబుజ్జిలి

ఘనంగా ఫిరంగి దళం వ్యవస్థాపక దినోత్సవం



వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న మాజీ సైనికులు

నరసన్నపేట: రెజిమెంట్ ఆఫ్ ఆర్టిలరీ (ఫిరంగి దళం) మాజీ గన్నర్స్(సైనికుల) ఆధ్వర్యంలో స్థానిక జమ్ము కూడలి వద్ద ఆదివారం 199వ ఫిరంగి దళం వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫిరంగి దళం మాజీ సైనికులు దీంట్లో పాల్గొని దేశ భద్రత, రక్షణలో ఫిరంగి దళం చేపట్టిన ధైర్య సాహసాలు, వివిధ సంఘటనలు గుర్తు చేసుకున్నారు. మిలటరీ ఆపరేషన్స్‌లో, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు సైతం ఫణంగా పెట్టిన వీర సైనికులకు నివాళులర్పించారు. సీనియర్ సభ్యులు, విశ్రాంత కెప్టెన్ నౌదూరి సత్యనారాయణ, విశ్రాంత లెఫ్టినెంట్ దేవలింగం సాంబశివరావు మాట్లాడుతూ.. యువత సైన్యంలో చేరి దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే ఫిరంగి దళం మాజీ సైనికులు కూడా యుద్ధానికి సిద్ధంగా ఉంటామన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1948, 1962, 1965, 1971, 1999, ఆపరేషన్ విజయ్, ఆపరేషన్ సింధూర్ వంటి యుద్ధాల్లో ఫిరంగి దళం విన్యాసాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత సుబేదార్ టంకాల రామారావు, సి.హెచ్. వైకుంఠరావు, ఆరంగి ఆనందరావు, విశ్రాంత హవల్దార్ తమ్మినేని కృష్ణారావు, నరసన్నపేటకు చెందిన ఫిరంగి దళం ప్రతినిధులు ఆర్.శ్రీనివాసరావు, సురేష్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ హయాంలోనే..

పొందర్లకు బీసీ కుల ధ్రువపత్రాలు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పొందర, కూరాకుల అనుబంధ విభాగం అధ్యక్షుడు రాజాపు అప్పన్న



నరసన్నపేట: వైఎస్ జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుటి నుంచే పొందర కులానికి చెందిన వారికి రాష్ట్ర వ్యాప్తంగా బీసీ–ఏ సర్టిఫికెట్ వస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పొందర, కూరాకుల అనుబంధ విభాగ అధ్యక్షుడు రాజాపు అప్పన్న అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జీఓ నంబర్ 25ను గత ప్రభుత్వం తీసుకురావడం జరిగిందన్నారు. దీంతో ఉత్తరాంధ్రా జిల్లాలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా పొందర కులానికి చెందిన వారు బీసీ–ఏ సర్టిఫికెట్ పొందుతున్నారన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అస్సెంబ్లీలో పొందర్లు బీసీ సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా పొందర్లకు బీసీ–ఏ ధ్రువీకరణ పత్రం వచ్చేలా చూడాలని సభ దృష్టికి తీసుకురావడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

కేవలం రాజకీయం కోసమే ఈ విధంగా మాట్లాడినట్లు తెలుస్తోందన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తమకు 2008లో బీసీ జబితాలో చేర్చారని, అప్పటి నుంచి ఉత్తరాంధ్రాలో బీసీ సర్టిఫికెట్లు పొందుతున్నామన్నారు. ఇతర జిల్లాలో ఇది అమలు కాలేదని అన్నారు. అయితే డిప్యూటీ సీఎం హోదాలో ధర్మాన కృష్ణదాస్ ఉన్నప్పుడు.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లారన్నారు. వైఎస్ జగన్ వెంటనే స్పందించి జీఓ నంబర్ 25 జారీ చేశారన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పొందర్లు బీసీ–ఏ కుల ధ్రువీకరణపత్రం గడిచిన మూడేళ్లుగా పొందుతున్నారని స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో పూజలు..



కొత్తూరు: చండీమాత అవతారంలో దుర్గాదేవి



సారవకోట: స్వర్ణమణి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు



హిరమండలం: దుర్గా, లక్ష్మీ, సరస్వతిదేవి వేషధారణల్లో విద్యార్థులు

సారవకోట: మండల కేంద్రంలోని ఉజ్జయినీ మహాకాళీ అమ్మవారిని ఆదివారం శాకాంబరీదేవిగా అలంకరించారు. అమ్మవారి విగ్రహాన్ని పలు రకాల ఆకుకూరలు, కూరగాయలతో అలంకరించి పూజలు నిర్వహించినట్లు పురోహితులు శ్రీనివాస శర్మ తెలిపారు. సారవకటోలని స్వర్ణమణి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలను రుత్వికులు సురేష్ శర్మ చేయించారు.

హిరమండలంలో..

హిరమండలం: హిరమండలంలోని ఓం శాంతి సేవా కేంద్రంలో ఆదివారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు లక్ష్మీ, దుర్గా, సరస్వతి దేవి వేషధారణల్లో ఆకట్టుకున్నారు. రాజయోగినీలు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: మండలంలోని పారాపురంలో నిర్వహిస్తున్న దసర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాదేవి చండీమాత అవతారంలో పూజలు అందుకున్నారు. ఏడో రోజు దుర్గాదేవికి ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దూర విద్యలో పది, ఇంటర్

హిరమండలం: దూర విద్యలో పది, ఇంటర్‌ను పూర్తిచేసుకునేందుకు ఏపీ సార్వత్రిక విద్యాపీఠం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈఓ రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాలతో బడి మధ్యలో మానేసినవారు, పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించని 14 ఏళ్లు నిండినవారు పదో తరగతి సార్వత్రిక పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 15 ఏళ్లు పూర్తయి ఇంటర్ ఫెయిలైన వారు ఇంటర్ పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సెలవు రోజుల్లో మాత్రమే తరగతులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలకృష్ణ క్షమాపణ చెప్పాలి



బి.నారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకుడు

పాతపట్నం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని, అసెంబ్లీ సాక్షిగా క్షమాణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాలకృష్ణ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు సభా సంప్రదాయాలకు విరుద్ధమన్నారు. ఆయన రాజకీయ అజ్ఞానానికి, మానసిక పరిస్థితికి నిదర్శనంగా భావించావల్సి వస్తుందన్నారు. బాలకృష్ణ పద్ధతి మార్చుకోకపోతే ప్రజాగ్రహం ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సింహాచలం, రామరాజు

పాతపట్నం: విప్లవ ధృవతారగా పేరుపొందిన భగత్‌సింగ్ ఆశయాలు ఎంతో గొప్పవని విశ్రాంత ఎంఈఓ బి.సింహాచలం కొనియాడారు. ఆదివారం స్థానిక ఆల్‌ఆంధ్రా రోడ్డు సమీపంలో మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భగత్ సింగ్ విగ్రహానికి రిబ్బన్, నూలు పోగులు వేసి నివాళులర్పించారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.రామరాజు మాట్లాడుతూ.. అతి పిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు భగత్ సింగ్ అని అన్నారు. హెచ్ఎం పి.కృష్ణారావు, ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవే సత్యసాయి మార్గం

సారవకోట: మానవ సేసే సత్యసాయి బాబా సూచించిన మార్గమని సత్యసాయి బాబా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. మండలంలోని మాళవ గ్రామంలో మాళవ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పి.మురళి ఆధ్వర్యంలో 100 గంటల అఖండ దివ్య నామ సంకీర్తన ముగింపు కార్యక్రమానికి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ సత్యసాయి బాబా సూచించిన సేవా మార్గాన్ని ఆచరిస్తున్నామన్నారు. దీంట్లో భాగంగా గ్రామసేవ కార్యక్రమం పేరుతో పశు వైద్య శిబిరాల నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు వైద్యంతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల్లో మానవతా విలువలు, పెద్దల పట్ల గౌరవం పెంచేందుకు జిల్లాలో 300 బాల వికాస్ కేంద్రాలు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రతీరోజు 5 వేల మందికి అన్నసంతర్పణ చేస్తున్నామన్నారు. సంఘం సేవా సమన్వయకర్త నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పల్లకి ఊరేగింపు

బూర్జ: మండలంలోని కేకేరాజపురం గ్రామంలో సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు సందర్భంగా సత్యసాయి భజన మండలి చిన్నకురింపేట ఆధ్వర్యంలో పర్తిస్వరుని పల్లకి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం 9వ పల్లకి ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. పల్లకి ఊరేగింపులో గ్రామంలో భక్తులు స్వామి వారికి హారతులు పట్టారు. ఆమదాలవలస జోనల్ కన్వీనర్ ఎం.రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా

డిజిటల్ బుక్

- ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్ ఉపయోగపడుతుందని, దీన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో రూపొందించారని పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్, క్యూ ఆర్ కోడ్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు కూటమి నాయకులు హాని తలపెట్టే అంశాలు ఉంటే వెంటనే వాటిని పంపిస్తే.. డిజిటల్ బుక్‌లో రిజర్వ్ చేస్తామన్నారు. ఎవరికి ఎక్కడ అన్యాయం జరిగినా దీని ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. దీన్ని కార్యకర్తలు అందరూ తెలుసుకోవాలని, సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వీటిపై చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వివిధ విభాగాల కార్యవర్గ సభ్యులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, దుంపల శ్యామలరావు, పొన్నాడ చిన్నారావు, బొడ్డేపల్లి అజంతాకుమారి, బి.వి.రమణమూర్తి, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు జెడ్పీటీసీ సభ్యులు సురవరపు నాగేశ్వరరావు, బెజ్జిపురపు రామారావు, లోలుగు కాంతారావు, పార్టీ మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, కొంచాడ రమణమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా



డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసన్నపేట: రెడ్ బుక్ రాజ్యాంగంతో అన్యాయానికి గురవుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, దీంట్లో భాగంగానే పార్టీ అధిష్టానం డిజిటల్ బుక్ తీసుకువచ్చిందని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కేసీహెచ్‌బీ గుప్త అన్నారు. నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ యాప్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో అనేక మంది వైస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టిందన్నారు. ఇళ్లు, షెడ్‌లు తొలగించడం జరిగిందన్నారు. కార్యకర్తలకు ఎటువంటి సమస్య ఉత్పన్నమైనా, అక్రమ అరెస్టులు చేసినా డిజిటల్ బుక్ యాప్‌లో వివరాలు నమోదు చేసేందుకు అవకాశం ఉందన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక న్యాయం చేయడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు ముద్దాడ బైరాగినాయుడు, జి.వి.రమణి, నక్క తులసీదాస్, రాజాపు అప్పన్న, దండి జయప్రకాశ్, మొజ్జాడ శ్యామ్, ధర్మాన జగన్, కణితి కృష్ణారావు, కనుసు సీతారాం, బొబ్బాది ఈశ్వరరావు, పతివాడ గిరీశ్వరరావు, కోటిపల్లి శ్రీను, కల్లేపల్లి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణించేది ఎలా?



ఈ చిత్రం సరుబుజ్జిలి–మదనాపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో ఏర్పడిన భారీ గొయ్యి. కూటమి ప్రభుత్వం రహదారులు బాగు చేయకపోవడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో రహదారి గుంతల్లో భారీగా నీరు చేరుతోంది. ఈ సమయంలో ప్రయాణాలు చేసేవారు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారులను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

ఆత్మీయ కలయిక



ఆమదాలవలస పట్టణంలోని మున్సిపల్ లక్ష్మీనగర్ హైస్కూల్‌లో 2003–04లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక వేడుక ఆదివారం జరిగింది. ఈ వేడుకకు 100 మందికి పైగా పూర్వవిద్యార్థులు హాజరై సందడిగా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి వారి ఆశీస్సులు పొందారు.

– ఆమదాలవలస

దీపాలంకరణ



నరసన్నపేట మండలంలోని మాకివలసలో దేవీ నవరాత్రుల సందర్భంగా దీపాలంకరణ ఆదివారం చేపట్టారు. దుర్గామాత చిత్రాన్ని ముగ్గులుతో వేసి దాని చుట్టూ భవానీ భక్తులు దీపాలు వెలిగించారు. దీపాలంకరణ ఆకట్టుకుంది.

– నరసన్నపేట

ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలి



నియామకపత్రాలను అందజేస్తున్న సుబ్బరాజు

ఆమదాలవలస: ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలని లైన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ కె.వి.సుబ్బరాజు అన్నారు. ఆదివారం ఆమదాలవలస పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో నిర్వహించిన లైన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలో పాల్గొన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వారికి సర్టిఫికెట్లు, నియామక పత్రాలు అందజేశారు. లైన్స్ క్లబ్ ఆమదాలవలస అధ్యక్షుడిగా జె.కె.వెంకటేశ్వరారావు, కార్యదర్శిగా బోయిన సునీత, ట్రెజరర్‌గా పొన్నాడ రోషిణికి నియామక పత్రాలు అందజేశారు. లైన్స్‌క్లబ్ పెద్దలంతా క్లబ్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మెంబర్లు, ఆమదాలవలస పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.